క్లుప్తంగా

ప్రజా వ్యతిరేక విధానాలపై అవిశ్రాంతపోరు

- సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



మాట్లాడుతున్న జంగయ్య

రాజేంద్రనగర్: దోపిడీ, దౌర్జన్యం, అక్రమాలకు వ్యతిరేకంగా సీపీఐ దాదాపు శతాబ్దకాలంగా అవిశ్రాంత పోరాటం చేస్తున్నదని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. రాజేంద్రనగర్ సీపీఐ మండల 16వ మహాసభను ఆదివారం ఆ పార్టీ స్థానిక కార్యాలయంలో జిల్లా సమితి సభ్యుడు ఆనంద్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జంగమ్మ సభను ప్రారంభించారు. వందో వసంతంలోకి అడుగుపెడుతున్న కమ్యూనిస్టు పార్టీ అప్పటి నుంచి నేటి వరకు ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వ ప్రజా, కార్మిక, శ్రామిక, కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను చేస్తోందన్నారు. వామపక్ష అర్బన్ నక్సలైట్ల పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం చేస్తున్నదన్నారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపి పరిష్కారం చూపాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్ రావు, రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు, ఒ.యాదయ్య మాట్లాడారు. ఈ సందర్భంగా మండల సీపీఐ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. మండల కార్యదర్శిగా కన్యగారి నరసింహారెడ్డి, సహాయ కార్యదర్శిగా విజయానంద్ గౌడ్, మామ షఫీలను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.ఎ.రియాజ్, నేతలు బాతరాజు నరసింహా, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి, ఎస్.మల్లేష్, సదానంద గౌడ్, స్వామి, శంకరయ్య, బాబురావు, పాండు తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా గంధంగూడ రోడ్లు



బండ్లగూడ: గోతులమయంగా మారిన రోడ్లపై ప్రయాణించాలంటే నరకం కనిపిస్తుందని ప్రజలు వాపోతున్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడ రోడ్లు గుంతలమయమై అధ్వాన స్థితికి చేరుకున్నాయి. దీంతో ఈ దారి గుండా ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు, పాదచారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గోతులమయంగా ఉన్న ఈ రోడ్లు అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. వర్షం పడితే చాలు ఎక్కడ గుంత ఉందో ఎక్కడ రోడ్డు ఉందో తెలియక వాహనదారులు ఆ గుంతల్లో పడి గాయపడిన ఘనటలు చాలానే ఉన్నాయి. సమస్యలను అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. త్వరగా రోడ్డు మరమ్మతులు చేపట్టి ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

ఎంఐఎం శంషాబాద్ అధ్యక్షుడిగా హస్నుద్దీన్



శంషాబాద్ ఎంఐఎం నూతన కార్యవర్గం

శంషాబాద్: ఏఐఎంఐఎం పార్టీ శంషాబాద్ పట్టణ, గ్రామీణ అధ్యక్షుడిగా మహ్మద్ హస్నుద్దీన్ నియమితులయ్యారు. ఆదివారం సాయంత్రం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఖలీల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎంపీ అసదుద్దీన ఓవైసీ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగం, కార్పొరేటర్ అబ్బార్, మాజీ కార్పొరేటర్ అబీద్ జైన్ ఆరీఫ్ తదితరులకు నూతన కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

డయాలసిస్ చికిత్సకు

నీటి కష్టాలు

- శంషాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి రోగుల తాకిడి
- చాలీచాలని నీటితో ఇబ్బందులు పడుతున్న వైద్యులు
- నిత్యం ఏడుగురు రోగులకు డయాలసిస్ చికిత్స

శంషాబాద్: ప్రభుత్వ దవాఖానాకు డయాలసిస్ రోగుల తాకిడి పెరుగుతోంది. గతంలో ప్రయివేటు లేదా ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రులకే పరిమితమైన డయాలసిస్ చికిత్స గత ఆరునెలలుగా ప్రభుత్వ దవాఖానాలో అందుబాటులోకి వచ్చింది. దీంతో ఆర్థిక స్థోమత అంతంతమాత్రమే ఉండి డయాలసిస్ చికిత్స అవసరమైన రోగులు ఇప్పుడు ప్రభుత్వ దవాఖానా బాటపడుతున్నారు.



శంషాబాద్ ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ చేసుకుంటున్న రోగులు

నీరే ప్రధానం...

డయాలసిస్ చికిత్సలో అత్యంత ప్రధానమైంది పూర్తిగా మంచినీరే. నీటితో పూర్తిగా డయాలసిస్ చికిత్సను అందజేస్తారు. ప్రస్తుతం పట్టణంలోని ప్రభుత్వ దవాఖానాలో ఆరు నెలల కిందట డయాలసిస్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని కోసం ప్రత్యేక గదితో పాటు ఐదు మంచాలు ఏర్పాటు చేశారు. ఒకే సమయంలో ఐదుగురు రోగులకు ఇక్కడ చికిత్స చేయడానికి కావాల్సిన పరికరాలతో పాటు అవసరమైన టెక్నీషియన్లు, నర్సులు కూడా ఉన్నారు. అన్ని ఉన్నా డయాలసిస్‌కు కావల్సిన ప్రధాన వనరైన మంచి నీరు మాత్రం కావల్సినంతగా లేదు. దీంతో మూడు షిఫ్టులుగా సేవలందించేందుకు అవకాశమున్నా ప్రస్తుతం ఇక్కడ రోజు ఏడుగురు రోగులకు మాత్రమే డయాలసిస్ చికిత్సను అందజేస్తున్నారు. దవాఖానాలో ఉన్న బోరులో నీరు సరిపోకపోవడంతో మున్సిపాలిటీ ట్యాంకరును ఆశ్రయిస్తున్నారు. అయినా నీరు అవసరాలకు సరిపడా అందుబాటులో లేదని వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోగులకు తప్పని నిరీక్షణ

మంచి నీటి కొరత కారణంగా కొత్తగా డయాలసిస్ కోసం వస్తున్న రోగులకు చికిత్స అందించలేని పరిస్థితి నెలకొంటుంది. నీటి సమస్య తీరితే రోగుల సేవలను పెంచేందుకు పూర్తి అవకాశాలున్నట్లు వైద్యులు చెబుతున్నారు. దీంతో రోగులు తమకు స్థానికంగానే డయాలసిస్ చికిత్స అందించాల్సిందిగా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో సిఫార్సులు సైతం చేయించుకుంటున్నారు.

దాతలు ముందుకొస్తే...

ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ రోగులతో పాటు సాధారణ రోగులకు సైతం నీటి కష్టాలు తీర్చేందుకు మరో బోరు వేయాల్సిన అవసరముంది. ప్రభుత్వ ఏర్పాటు చేసే లోపు దాతలు ముందుకొచ్చి బోరు వేయించి నీటి సమస్యను తీర్చితే రోగులకు సాంత్వన చేకూరుతుందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. మరో వైపు కొత్త ఆస్పత్రి నిర్మాణం త్వరగా చేపడితే నీటి కష్టాలు తీరే మార్గాలున్నాయని వైద్యులు, సిబ్బంది ఆశతో ఎదురుచూస్తున్నారు.

రోగుల సంఖ్య పెరుగుతోంది



డయాలసిస్ చికిత్సకు వచ్చే రోగుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. డయాలసిస్ చికిత్సకు గదితోపాటు అన్ని పరికరాలు, టెక్నీషియన్లు, నర్సులు పూర్తి స్థాయిలో ఉన్నారు. చికిత్సకు ప్రధానమైన నీరే ఇక్కడ కొరతగా ఉంది. సమస్యను ఉన్నతాధికారులతో దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం బోరు సరిగా రావడం లేదు. మున్సిపాలిటీ ట్యాంకరుతో నీటి సరఫరా చేస్తుంది. సమృద్ధిగా నీటి సౌకర్యం పెరిగితే మూడు షిఫ్టుల్లో డయాలసిస్ చికిత్సను పెంచేందుకు అవకాశముంటుంది.

– డాక్టర్ దుర్గలత, ఆస్పత్రి సూపరింటెండెంట్



రథంపై ఊరేగుతున్న వేణుగోపాలస్వామి

ముగిసిన వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల శివారులో ఉన్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. గత నెల 28వ తేదీన ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు ఆదివారంతో పూర్తయ్యాయి. చివరిరోజు ఆదివారం ఉదయం మహాపూర్ణాహుతి, చక్రస్నానం, సాయంత్రం అశ్వవాహన సేవ, దేవతా విసర్జన, రుత్విక్‌సన్మానం నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా శనివారం రాత్రి దేవాలయం ఆవరణలో కొత్తగా తయారు చేయించిన రథంపై స్వామి వారిని ఉంచి దేవాలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం శేషవాహన సేవ నిర్వహించారు. వారం రోజులుగా ఆలయ ప్రాంగణం వేత పండితుల మంత్రోచ్ఛరణలు, హోమాలతో మారుమోగింది. ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సహకరించిన మంచిరేవుల గ్రామస్తులతో పాటు నిర్వాహణ కర్త సంతోష్‌రెడ్డిలకు అర్చకులు గూడా శ్రీనివాసాచార్యులు, వరదరాజాచార్యులు, రాజగోపాలాచార్యులు అభినందించారు.



చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

నయనానందకరం



తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయ భవనం సరికొత్త అందాలను సంతరించుకుంది. రంగు రంగుల విద్యుత్ దీపాలతో నయనానందకరంగా తీర్చిదిద్దారు. పాదచారులు, వాహనదారుల హృదయాలను హత్తుకునేలా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కార్యాలయం వైపు వచ్చిన వారు తమ సెల్ ఫోన్లలో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

– రాజేంద్రనగర్

రోడ్లు.. వీధి దీపాలు కావాలంటూ ఆందోళన

మణికొండ: మాకు రోడ్లు కావాలి.. వీధి దీపాలు కావాలి అంటూ వెంకటేశ్వర కాలనీ ప్రజలు ఆదివారం ఆందోళన బాట పట్టారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో ప్రధాన రోడ్లు వేయకపోవటంతో ప్రజలు బురద, మట్టి రోడ్లపై ప్రయాణాలు చేస్తున్నారు. ఎక్కువ శాతం రోడ్లకు వీధి దీపాలు లేక పోవటంతో రాత్రి సమయాల్లో ఇంటికి రావాలంటే భయాందోళన చెందుతున్నారు. దాంతో తమ కాలనీలో రోడ్లు వేయాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, అన్ని కాలనీల మాదిరిగానే తాము పన్నులు చెల్లిస్తున్నా తమకు సౌకర్యాలు ఎందుకు కల్పించరని వారు నినదించారు. అనేక కాలనీల్లో గృహాలు, తిరిగే ప్రజలు లేక పోయినా రోడ్లు వేస్తున్నారని, తమ కాలనీలో ప్రజలు తిరుగుతున్నా రోడ్లు ఎందుకు వేయరని వారు ప్రశ్నించారు. అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు, ఆన్‌లైన్ ఆర్డర్‌ల వారు తమ కాలనీకి రావటం లేదని వారు వాపోయారు. మున్సిపాలిటీ అధికారులకు అనేక సార్లు వినతిపత్రాలు ఇచ్చినా తమ సమస్యలు పరిష్కరించటం లేదని, అందుకే ఆందోళన బాట పట్టామన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి ఆందోళనలను తీవ్రతరం చేస్తామన్నారు.



ఆందోళన చేస్తున్న వెంకటేశ్వర కాలనీవాసులు

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



ఓంనగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న సురేష్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అభివృద్ధి పనుల్లో భాగంగా ఓంనగర్ కాలనీలో నూతనంగా జరుగుతున్న సీసీ రోడ్డు పనులను కాలనీ వాసులతో కలిసి ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోకరి సురేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్పొరేషన్ పరిధిలో ప్రజల సౌలభ్యం కోసం మెరుగైన వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో నేతలు సుధాకర్, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పంపిణీలో ఇబ్బందులు

- మొరాయించిన సర్వర్
- వేలిముద్రల కోసం తప్పని నిరీక్షణ
- కొన్ని దుకాణాలకు చేరని బియ్యం స్టాక్

శంషాబాద్ రూరల్: మూడు నెలల రేషన్ ఒకేసారి పంపిణీతో దుకాణాల వద్ద ఆదివారం ఇబ్బందులు ఎదురయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లబ్ధిదారులకు అందజేస్తున్న రేషన్ బియ్యాన్ని ఇప్పటి వరకు ఒకే యాప్ ద్వారా పంపిణీ జరిగేది. జూన్ నెల నుంచి వేర్వేరుగా పంపిణీ కోసం చర్యలు తీసుకున్నారు. ఇందుకు గాను రెండు రకాల యాప్ ద్వారా లబ్ధిదారుల నుంచి వేలిముద్రలు సేకరించాల్సి వస్తుంది. అంతేకాకుండా మూడు నెలల కోటా బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తుండటంతో లబ్ధిదారులు ఆరు సార్లు వేలిముద్ర వేయాల్సి వస్తోంది. ఇదే సమయంలో సర్వర్‌లో సమస్య తలెత్తడంతో ఒక్కో లబ్ధిదారుడికి కనీసం 20 నిమిషాలు సమయం పట్టింది. దీంతో రేషన్ కోసం లబ్ధిదారులు దుకాణాల వద్ద గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది.



శంషాబాద్ మండలంలోని మదన్‌పల్లిపాతతండాలో రేషన్ దుకాణం వద్ద వేచి ఉన్న లబ్ధిదారులు



రాజేంద్రనగర్‌లో రేషన్ దుకాణం వద్ద క్యూ కట్టిన ప్రజలు

దుకాణాలకు చేరని రేషన్ బియ్యం...

శంషాబాద్ మండలంలోని రేషన్ దుకాణాల్లో సగానికి పైగా రేషన్ బియ్యం ఇంకా చేరలేదు. మూడు నెలల కోటాను ఒకేసారి పంపిణీ చేపట్టగా.. భారీ స్థాయిలో స్టాకును దుకాణాలకు చేరవేయాల్సి వస్తుంది. దీంతో పూర్తి స్థాయిలో దుకాణాలకు బియ్యం వచ్చేందుకు మరో నాలుగైదు రోజుల సమయం పట్టేలా ఉంది. మల్కారం, రామంజాపూర్, ననాజీపూర్ తదితర గ్రామాల్లోని దుకాణాలకు ఇంకా బియ్యం రాలేదు. పాల్మాకుల, చౌదరిగూడ దుకాణాలకు ఆదివారం పంపిణీ చేశారు.

రాజేంద్రనగర్‌లో గందరగోళం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఆదివారం నుంచి ప్రారంభమైన మూడు నెలల సరుకుల పంపిణీ గందరగోళంగా మారింది. సెలవు దినం కావడంతో ఉదయం నుంచే దుకాణాల వద్ద వినియోగదారులు బారులు తీరారు. సెలవు రోజే మూడు నెలల సరుకులు తీసుకుందామని ఉదయం నుంచి రాత్రి వరకు వేచి ఉన్నా.. తమకు సరుకులు అందలేదని లబోదిబోమన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు మూడు నెలలకు సంబంధించిన రేషన్ సరుకులను పంపిణీ చేసేందుకు సిద్ధం చేసింది. రాజేంద్రనగర్ సర్కిల్‌లో 60 రేషన్ దుకాణాల ద్వారా 61,627 మంది లబ్ధిదారులకు సరుకులను అందించేందుకు ఏర్పాట్లు చేసింది.

ఉదయం నుంచే సర్వర్ పని చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం 10 గంటల వరకు ఎలాంటి సరుకుల పంపిణీ సాగలేదు. అనంతరం 15–20 నిమిషాలకు ఒకరికి మాత్రమే సరుకులు ఇచ్చేందుకు సమయం పట్టింది. దీంతో రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు కాశారు. ఆదివారం నుంచి సాయంత్రం వరకు సర్కిల్ పరిధిలో కేవలం 1000 లోపు మాత్రమే వినియోగదారులకు సరుకులను అందజేశారు. మిగిలిన వారంతా ఉసూరుమంటూ వెనుతిరిగారు.

ఇందిరమ్మ కమిటీ తీరుపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని తొండుపల్లి ఇందిరమ్మ కమిటీ తీరుపై కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు బాత్కు నర్సింహా యాదవ్, జిల్లా కార్యదర్శి పరమేష్ మాట్లాడుతూ... పదో వార్డులోని ఇందిరమ్మ కమటీని స్థానిక మాజీ కౌన్సిలర్ తనయుడు అస్తవ్యస్తంగా మార్చారని ఆరోపించారు. ఆయనతో పాటు మిగతా సభ్యులు కూడా బీఆర్ఎస్ నేతలేనన్నారు. పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసే కమిటీలో అధికారులు ఇలాంటి వారికి ఎలా చోటు కల్పించారని ప్రశ్నించారు. ఎస్సీలకు కూడా కమిటీలో చోటు ఇవ్వలేదని ఆగ్రమం వ్యక్తం చేశారు. కమిటీ తీరు కారణంగా స్థానికంగా ఉన్న అర్హులకు సంక్షేమ పథకాలు అందకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులతో పాటు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కల్పించుకుని సవరించాలని కోరారు. సమావేశంలో నాయకులు అశోక్, నర్సింహా, ఖదీర్, పి.నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

బస్తీల్లో అధ్వానంగా పారిశుద్ధ్య వ్యవస్థ

మైలార్‌దేవ్‌పల్లి: బస్తీల్లో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని తద్వారా ప్రజలు పలు రోగాల బారిన పడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు. శుభోదయం మైలార్‌దేవ్‌పల్లి కార్యక్రమంలో భాగంగా ఆప్కో కాలనీ (ఆదర్శ కాలనీ)లో బీఆర్ఎస్ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సరైన పైప్‌లైన్ ప్రతి ఇంటి వరకు వేస్తే తాగునీటి సమస్య, కలుషిత నీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. నివాస గృహాల మధ్య రోడ్డుకు ఇరువైపులా చెత్తచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తున్నదన్నారు. ప్రజలు ఈ దారి గుండా ముక్కుమూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. అసంపూర్తిగా రోడ్ల నిర్మాణాలు పనులు వదిలి వేయడంతో అస్తవ్యస్తంగా మారాయన్నారు. నిధులు విడుదల చేయించి డబుల్ బెడ్‌రూమ్‌లు సగంలోనే పనులు నిలిచిపోయాయన్నారు. ఆ బెడ్‌రూమ్‌లు నిర్మించే ప్రాంతమంతా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. నేతలు రాముయాదవ్, యూత్ అధ్యక్షుడు అక్కం రఘువేందర్‌యాదవ్, నేతలు రాజేష్‌యాదవ్, సోమ శ్రీనివాస్ గుప్తా, మైసిరెడ్డి, ఎడ్లకాడి సూర్యం, జి.రాజు, ప్రవీణ్, చిరంజీవి, రాజు, జగదీష్, సరిత, మహేష్, భూదేవి, అరుణ రెడ్డి, వెంకటరమణ, అశోక్‌కుమార్, సునీల్, భాస్కర్, కార్తీక్‌ముదిరాజ్, రిషి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై పేరుకుపోయిన చెత్తను చూపిస్తున్న బీఆర్ఎస్ మైలార్‌దేవ్‌పల్లి అధ్యక్షుడు వెంకటేష్